క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మాగనూర్: మండలంలోని మందిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో 2025–26 నుంచి ప్రారంభించనున్న పూర్వ ప్రాథమిక తరగతులకు టీచర్ పోస్టుతో పాటుగా ఒక ఆయా పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిమ్మన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు కనీస విద్యా అర్హత ఇంటర్ లేదా సమానమైన అర్హతను కలిగి ఉండాలన్నారు. ఆయా పోస్టుకు కనీసం ఏడో తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. వయస్సు 18 ఏళ్ల నుంచి 44 సంవత్సరాలు కలిగి ఉండాలని, దరఖాస్తు చేసుకోవడానికి తుది గడువు శనివారం వరకు ఉందన్నారు. దరఖాస్తులు సంబంధిత ప్రధానోపాధ్యాయునికి సమర్పించాలని సూచించారు.

అంగన్‌వాడీ టీచర్ల హౌస్ అరెస్టు

మక్తల్: మండలకేంద్రంలోని అంగన్‌వాడీలను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. తమ సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో నిర్వహించనున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి వెళ్తుండగా ఇంటికి వెళ్లి హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు సీఎం రేవంత్‌రెడ్డి సర్కారుపై మండిపడ్డారు.ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యాశాఖకు అప్పజెప్పడం కారణంగా అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. వాటిని ఐసీడీఎస్‌కి అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గోవిందురాజ్, భాగ్యలక్ష్మి, నర్సింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బతుకమ్మ సంబరాలు



మరికల్: మండల కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. రంగు, రంగుల పూలతో విద్యార్థులు బతుకమ్మలను తయారు చేశారు. అనంతరం బతుకమ్మ ఆటపాటలతో అలరించారు. ఉపాధ్యాయులతో కలిసి బతుకమ్మలతో ఊరేగింపుగా వెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు.
కార్యక్రమంలో గౌతమి మోడల్ కరస్పాండెంట్ రాజేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్, వెంకటేశ్వర్లు, రఘు, రాములు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా ఉపాధ్యక్షుడిగా సుంకు ఉమేష్‌శెట్టి

ధన్వాడ: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రనికి చెందిన మాజీ ఎంపీటీసీ సుంకు ఉమేష్‌శెట్టి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను శుక్రవారం మండల నాయకులు అభినందనలు తెలుపుతూ శాలువాతో సన్మానించారు. జిల్లాలో బీజేపీ ప్రతి ఇంటికి తీసుకెళ్లి వచ్చే పంచాయతీ ఎన్నికలో విజయం సాధించేలా కృషి చేస్తానని తెలిపారు. ఇందులో కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రాంచంద్రయ్య, ఉదయభాను, మాజీ ఎంపీటీసీలు మల్లయ్య, మండల అధ్యక్షుడు శివరాజ్ ఉన్నారు.

పాఠశాల తనిఖీ

మాగనూర్: మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి మురళీధర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం తరగతి గదులలో విద్యార్థులతో ముచ్చటించి వారి సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు ఒక నిమిషానికి 30 పదాలు చదివే విధంగా, గణితంలో విద్యార్థులకు ప్రాక్టీస్ చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే అన్ని రికార్డులను ప్రతిరోజు అప్డేట్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు హుస్సేన్, సిఆర్పీ కృష్ణయ్య ఉన్నారు.

గురుకులంలో అడ్మిషన్ ఇప్పించండి

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి వినయ్ కుమార్‌కు గురుకులంలో అడ్మిషన్ ఇప్పించాలని విద్యార్థి తండ్రి నాగేష్ ఒక ప్రకటనలో కోరారు. ప్రవేశ పరీక్షకు హాజరై మెరిట్ లిస్ట్‌లో పేరు ఉన్న మండలానికి చెందిన జ్యోతిబా పులే ఎస్సీ గురుకుల పాఠశాలలో అడ్మిషన్ ఇవ్వడం లేదని వాపోయారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను జిల్లా అధికారులను కలిసిన న్యాయం చేయడం లేదన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయలని కోరారు.

విత్తనాల పంపిణీ

మద్దూరు: మండలంలోని దోరేపల్లి గ్రామంలోని భూసంపత్తి రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఏట రామకృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, రైతు సంఘం అధ్యక్షుడు నాగరాజు రైతులకు 100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను అందజేశారు. ఎన్ఎంఈఓ పథకం కింద ప్రస్తుత సీజన్‌లో 1250 ఎకరాల్లో వేరుశనగ పంటను ఈ సంఘం ద్వారా వేస్తున్నట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఇక నిరంతరం 'నిఘా'



పోలీస్ స్టేషన్‌లో సీసీ కెమెరాల మానిటరింగ్

- మద్దూరులో వైఫై సీసీ కెమెరాల ఏర్పాటు
- కడా నుంచి నిధులు మంజూరు చేసిన అధికారులు
- సీసీ కెమెరాలతో నేరాలకు చెక్

మద్దూరు: పట్టణంలో నేరాల నియంత్రణకు పోలీసు శాఖ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. గతంలో కేబుల్ వైర్ల ద్వారా ఏర్పాటు చేసిన కెమెరాలు పిడుగుపాటు, వర్షాలకు, గాలీ వాన వీచిన సమయాల్లో సాంకేంతిక సమస్యలు తలెత్తేవి. వాటిని మరమ్మతు చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది. ఈ సమస్యను అధిగమించేందకు వైఫై ద్వారా ఏలాంటి వైర్లు లేకుండా, నిరంతరం పని చేసే విధంగా కొత్త వాటిని ఏర్పాటు చేశారు. పట్టణం మొత్తంలో 40 సీసీ కెమెరాల ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 28 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గత రెండు నెలలుగా ఈ కెమెరాలు పనిచేస్తున్నాయి.

నిర్వహణ లేక పాడైన కెమెరాలు

2019లో అప్పటి ఎస్పీ చేతన అన్ని పట్టణాల్లో, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం పట్టణంలోని వ్యాపారస్తులు, ప్రజలను భాగస్వామ్యం చేసి 32 కెమెరాలను ఏర్పాటు చేయించారు. అయితే ఈ కెమెరాలు



పాతబస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

కేబుల్ ద్వారా పోలీస్ స్టేషన్‌కు అనుసంధానించడంతో తరుచూ సమస్య ఎదురయ్యేయి. దాదాపు రూ.7లక్షలతో ఏర్పాటు చేసిన ఈ కెమెరాలు 8 నెలల పాటు పనిచేశాయి. అయితే తర్వాత మరమ్మతుకు గురి కావడంతో వీటి నిర్వహణ పోలీసులకు కష్టంగా మారింది. ఈ క్రమంలోనే వైఫై కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

రూ.17 లక్షలు నిధులు మంజూరు

పట్టణంలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదనే విషయాన్ని పోలీసులు ' కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారటీ (కడా) అధికారి వెంటక్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రూ.17 లక్షలు నిధులను మంజూరు చేయడంతో ప్రభావంతమైన కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం 28 కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి ఏర్పాటై రెండు నెలలు గడుస్తుంది. మిగితా 12 కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. రోడ్డు విస్తరణ తదితర పనులు జరుగుతున్న నేపథ్యంలో మిగితా వాటి ఏర్పాటుకు కొంత సమయం పడుతుందని తెలిపారు.

పట్టణాభివృద్ధికి కృషి

గతంలో ఏర్పాటు చేసినా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల ఏర్పాటు ముఖ్యమని భావించి కాంగ్రెస్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో కడా నుంచి నిధులను మంజూరు చేయించారు. మద్దూరు పట్టణాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించారు. ఈ క్రమంలోనే వైఫై సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు విడుదల చేశాం.
–నర్సింహా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

పట్టణంలో చోరీలు ఇతరత్రా నేరాలు జరిగినప్పుడు కేసులను ఛేదించడానికి సీసీ కెమెరాలు కీలకం. ఇటీవల జరిగిన దొంగతనంలో సీసీ కెమెరాల ఆధారంగానే నేరస్తులను గుర్తించాం. పట్టణంలో ఎక్కడ ఏ చిన్న సమస్యలు వచ్చిన వెంటనే స్పందించడానికి ఈ సీసీ కెమెరాలు ఉపయోగపడుతున్నాయి. ఇంకా పూర్తి స్థాయిలో వీటిని బిగించాల్సి ఉంది.
– విజయ్‌కుమార్, ఎస్‌ఐ, మద్దూరు

ప్యాసింజర్ రైలును పొడిగించండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మరికల్: రైలు ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాయచూర్–బీజాపూర్ ప్యాసింజర్ రైలును మహబూబ్‌నగర్ వరకు పొడిగించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ నుంచి కర్ణాటక, మహారాష్ట్ర వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం కోసం రైలును పొడిగించాలని విన్నవించారు. ఇందుకు ఎంపీ సానుకులంగా స్పందించి రైల్వే ఉన్నత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమేష్, వేణు, రామేశ్వర్‌రెడ్డి, రాజేష్, శ్రీరామ్, నిఖిల్ పాల్గొన్నారు.

సీసీరోడ్డుకు భూమిపూజ

ధన్వాడ: మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కూర్వ వీధిలో బోడ్రయి నుంచి పాతపల్లి వరకు సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ.15 లక్షలు మంజూరు కావడతంతో భూమి పూజ నిర్వహించారు. అనంతరం బిర్రప్ప దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యయదవ్, రాష్ట్ర నాయకులు రతంగ్‌పాండురెడ్డి, మండల అధ్యక్షుడు శివరాజ్, సురేందర్, ఉదయభాను, గోవర్ధన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కంసాన్‌పల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

ధన్వాడ: కంసాన్‌పల్లి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ గ్రామ అభివృద్ధి సంఘం యువకులు ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ధన్వాడకు వచ్చిన ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ధన్వాడ గ్రామానికి బస్ సౌకర్యం లేక రోజూ విద్యార్థులు, యువకులు, వృద్ధులు నాలుగు కిలోమీటర్లు నడుచుకుంటూ ధన్వాడకు వస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో సర్వే చేసి సర్వీసు ప్రారంభిస్తామని చెప్పి ఇప్పటి వరకు బస్ సౌకర్యం కల్పించలేదని వాపోయారు. వెంటనే బస్ సౌకర్యం కల్పించి విద్యార్థుల ఇబ్బందులు తొలగించాలని కోరారు.

ఎంపీకి సన్మానం

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి గ్రామంలో జరిగిన సమావేశంలో శుక్రవారం ఎంపీ డీకే అరుణను ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆమె గ్రామంలో పర్యటించగా సన్మానించి మండలంలో అభివృద్ధి పనులు చేపట్టాలని వినతిపత్రాలు అందజేశారు. నాయకులు భాస్కర్, విజయన్‌గౌడ్, ఆశప్ప, భరత్, చంద్రశేకర్‌గౌడ్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు



జేసీబీ సాయంతో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

నారాయణపేట టౌన్: ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నర్సయ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా నారాయణపేట శివారు సింగారం రోడ్డులో జేసీబీ సాయంతో శుభ్రం చేశారు. కొన్ని నెలలుగా రోడ్డు ప్రక్కన చెత్తా పేరుకుపోవడంతో చెత్తాను తొలగించి మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలందరూ తమ ఇళ్లతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అదే విధంగా బహిరంగ ప్రదేశాలో చెత్తా వేయకుండా పట్టణాన్ని స్వచ్ఛ పట్టణంగా మార్చడంలో సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్, ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం ప్లాస్టిక్‌ను నిషేధించాలి



ప్లాస్టిక్ నిషేధించాలని ఎస్‌ఐకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

మరికల్: భవిష్యత్ తరాల కోసం ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ మహేశ్వరీ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవాణి పాఠశాల విద్యార్థులు శుక్రవారం ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై ఫ్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎస్ పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వాడకం పెరిగిపోవడం వల్ల వ్యాధులు బారిన పడే అవకాశం ఉందన్నారు. అలాగే భూమికి కూడా ప్రమాదమేనన్నారు. అనంతరం విద్యార్థులు ఎస్‌ఐకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఎల్లయ్య, కరస్పాండెంట్ వెంకటేశ్వర్లశర్మ, పూర్ణిమ్మ, వినితమ్మ, రఘు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే మెప్పు కోసం దౌర్జన్యం చేయడం సరికాదు'

నారాయణపేట రూరల్: ఎమ్మెల్యే మెప్పు పొందడం కోసం కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ అధికారులపై దౌర్జన్యానికి దిగడం సరికాదని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. గురుకుల పాఠశాలలో జరిగిన టీఎల్ఎం మేళాకు వెళ్లి విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ చించి వేయడం సరికాదన్నారు. ప్రజాపాలన అంటే ప్రభుత్వాధికారులపై దౌర్జన్యం చేయడమా అని ప్రశ్నించారు. విద్యారంగా అభివృద్ధి కోసం కృషి చేయాలనుకునే నాయకులు పాఠశాలల్లో, వసతి గృహాల్లో సౌకర్యాలు, వసతులను కల్పించేందుకు, నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. గురుకుల విద్యార్థులకు ఇబ్బంది కలిగించి, డీఈఓ పట్ల దురుసుగా ప్రవర్తించిన నాయకులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వైద్యశిబిరాలను సద్వినియోగించుకోవాలి



నర్వ పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలు

మాగనూర్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఎంపీడీవో శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ క్యాంపును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తారని, మహిళలు ఈ హెల్త్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి అఫ్రోజ్, సీనియర్ నాయకులు శివరాంరెడ్డి, కృష్ణ మండల యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సర్ఫరాజ్, బీజేపీ నాయకులు భరత్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యానికి పెద్దపీట

నర్వ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'స్వస్థ్ నారీ.. సశక్తి పరివార్'ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డా.వినుత అన్నారు. శుక్రవారం నర్వ పీహెచ్‌సీలో స్వస్థ్ నారీ.. సశక్తి పరివార్‌లో భాగంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అత్యవసర చికిత్స అవసరమున్న వారిని జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. వైద్యులు డా. రాకేశ్, నర్వ పీహెచ్‌సీ వైద్యులు వెంకటరమణ, ఏఎన్ఎంలు, ఆశాలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న అడ్వకేట్ లక్ష్మీపతి గౌడ్

దామరగిద్ద: రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందని లీగల్ సెల్ డిఫెన్స్ కౌన్సిల్ లక్ష్మీపతిగౌడ్ అన్నారు. లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ ఆదేశాల మేరకు శుక్ర వారం మండలంలోని ఉల్లిగుండం, గత్ప విఠలపూర్, మొగుల్‌మడ్క గ్రామాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలకార్మిక చట్టాలు, సీనియర్ సిటిజన్ యాక్ట్, గిరిజన, మహిళల రక్షణచట్టం, నిత్యవసర సరుకులు చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉచిత న్యాయ సలహాల కోసం 15100 నంబర్ ద్వారా న్యాయ సలహాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాఘవకృష్ణ, కన్కప్ప, నారాయణ, కన్నయ్యగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, సత్యప్ప, ఆంజనేయులు యాదయ్య పారాలీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

కోస్గి: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ కేజీబీవీ సిబ్బంది ఈనెల 22న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ, సహాయ కార్యదర్శి ఎదిరింటి నర్సింములు అన్నారు. ఈ మేరకు శుక్రవారం నాచారం గ్రామంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఎస్‌డీపీ కార్యాలయం ముట్టడికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చి తీరా ఇప్పుడు మాటతప్పడం సరికాదన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు కేజీబీవీ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు హన్మంతు, యశోద, రాధారాణి , సావిత్రమ్మ, అంజిలమ్మ, భాగ్యమ్మ, రజిత, మంజుల, సాబెరా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభం



రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మాగనూర్: మండలంలోని పర్మన్‌దొడ్డి నుంచి మక్తల్‌కు వెళ్లే మట్టి రోడ్డు మొత్తం గుంతల మయంగా మారడంతో మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు శుక్రవారం కాంగ్రెస్ నాయకులు మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ మాట్లాడుతూ.. 15 ఏళ్లుగా ఈ గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదన్నారు. రోడ్డు సమస్యను మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే స్పందించారన్నారు. ప్రస్తుతానికి మట్టితో గుంతలను పూడ్చి త్వరలోనే అమ్మపల్లి మీదుగా గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు మంత్రి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, సీనియర్ నాయకులు శివరాంరెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'భూభారతి' సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐక్య రైతు సంఘం నాయకులు

నారాయణపేట రూరల్: మండల వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న భూభారతి సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏఐయూకేస్ మండల అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మండల తహసిల్దార్ అమరేందర్ కృష్ణకు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించడం కోసం రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకున్న రైతుల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు, అలాగే మండల వ్యాప్తంగా రైతులకు సరిపడా యూరియాను కూడా సరఫరా చేసే విధంగా బ్లాక్ మార్కెట్లో తరలిపోకుండా చూడాలని వారు కోరారు, ఈ కార్యక్రమంలో కార్యదర్శి బాలకృష్ణ, సహ కార్యదర్శి సుభాష్, నాయకులు కృష్ణ, అశోక్, వెంకటయ్య పాల్గొన్నారు.

మద్దూరు: మండలంలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ధరణి పేరుతో రైతులను మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూభారతి ద్వారా అయిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పత్తిపై ఉన్న 11 శాతం సుంకాన్ని రద్దు చేసి కాటన్ కార్పోరేషన్ ద్వారా పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఐక్య రైతు సంఘం నాయకులు కొండ నర్సిములు, ఆశప్ప, అంజి, శ్రీహరి, అంజి, వెంకటప్ప, కృష్ణయ్య, రాజు, హన్మప్ప, కన్కప్ప, తదితరులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాల కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న రజక సంఘం సభ్యులు

ధన్వాడ: శ్రీ వెంకటేశ్వర రజక సంఘం ఆధ్వర్యంలో దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కరపత్రాలను విడుదల చేశారు. స్థానిక రజక సంఘం భవనం వద్ద ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చే నెల 3 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు పూజారి పట్టెల్ నర్సింములు తెలిపారు. ఉత్సవాలు ప్రారంభించి నేటికి 11 ఏళ్ల పూర్తి అయిందని 12 సంవత్సరం వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి నర్సింములు, బాలయ్య, కొండన్న, బాలప్ప తదితరులు పాల్గొన్నారు

ఉత్సవాలను జయప్రదం చేద్దాం

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో అత్యంత వైభవంగా నిర్వహించే దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యాయాదవ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా వేడుకలకు ముందు జరుపుకునే దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 9 రోజుల పాటు అమ్మవారిని వివిధ అవతరాల్లో అలంకరించి పూజలు చేయనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రతంగపాండురెడ్డి, కేశవులు, దేవేందర్‌గౌడ్, నర్సన్‌గౌడ్, శివ, పాపిరెడ్డి, అంజిరెడ్డి, తిరుపతిరెడ్డిలు పాల్గొన్నారు.

చెస్ బోర్డులు అందజేత

మద్దూరు: పాలమూరు ఎన్నారై ఫోరం, చెస్ నెట్వర్క్ టీం ఆధ్వర్యంలో మండలంలోని మద్దూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం చెస్‌బోర్డులను అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి, మేధాశక్తిని పెంపొందించడానికి చెస్ పోటీలు ఉపయోగపడతాయని అందుకే చెస్ బోర్డులను అందజేసినట్లు ఫోరం ప్రతినిధి మహిపాల్‌రెడ్డి తెలిపారు.

క్రీడా దుస్తుల పంపిణీ

మద్దూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఖోఖో క్రీడాకారులకు పూర్వ విద్యార్థులు శుక్రవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. 2018–19 పదోతరగతి బ్యాచ్‌కు చెందిన నాగంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు వీటిని అందజేసినట్లు పీఈటీ వెంకటప్ప తెలిపారు.

బాల్య వివాహాలను అరికడదాం

నారాయణపేట టౌన్: బాల్య వివాహాలశు నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు అన్నారు. విజన్ సంస్థతో కలిసి బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై పట్టణంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నప్పుడు పెళ్లి చేయడంతో బాలికకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, తల్లిదండ్రులకు శిక్ష పడే అవకాశం ఉందన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

దామరగిద్దలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. డీఆర్పీ శ్రీకాంత్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎలా వ్యాప్తి చెందుతుంది, వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు.

అసత్య ప్రచారంపై ఎస్పీకి ఫిర్యాదు

నారాయణపేట రూరల్: అసత్య ప్రచారంపై నిగ్గు తేల్చి, దోషులను కఠినంగా శిక్షించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్‌కు మండలంలోని కోటకొండకు చెందిన విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి బాలస్వామి ఫిర్యాదు చేశారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి వెళ్లిన ఆయన ఎస్పీతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణపై తాను ట్రోలింగ్ చేసినట్లు ఆరోపణలు వచ్చాయని, ఇలాంటి తప్పుడు పోస్టులు పెట్టిన దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు.

ముగిసిన హిందీ దివస్ పోటీలు

నారాయణపేట రూరల్: హిందీ దివస్‌ను పురస్కరించుకొని గత రెండు రోజులుగా స్థానిక హిందీ ప్రచార్ సమితిలో విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీలు శుక్రవారం ముగిశాయి. భారతీయ సంస్కృతి గొప్పతనం, నూతన విద్యా విధానంలో భారతీయ భాషల స్థానం, అంతరిక్ష విజ్ఞానంలో భారతావని అభివృద్ధి అనే అంశాలపై వ్యాసరచన పోటీ, భావాత్మక హిందీ పాటలు, హిందీ పదాల డిక్టేషన్ తదితర పోటీలు నిర్వహించారు. త్వరలో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. హిందీ టీచర్లు దీపక్, మోనప్ప, నర్సింహా, రామకృష్ణ, అంబాదాస్, శశికళ పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో శ్రమదానం

దామరగిద్ద: మండలంలో నర్సాపూర్ గ్రామంలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ సమక్షంలో లోకూర్తి సేవ పక్షం కార్యకర్తలు స్వచ్ఛభారత్ లో భాగంగా శ్రమదానం నిర్వహించి మోదీకి శుభాకాంక్షలు తెలియజేశారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఈదప్ప, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

కోస్గి రూరల్: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. దౌల్తాబాద్ మండలంలోని సంగాయపల్లికి చెందిన శ్యాంరెడ్డి భార్య సునిత, కూతురుతో కలిసి పట్టణంలో ఓ ఇంటికి కిరాయికు తీసుకొని ఉంటున్నాడు. అయితే భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో గురువారం కూడా గొడవ జరగగా శ్యాంరెడ్డి (48) గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం భార్య వెళ్లి తలుపు తెరిచేందుకు ప్రయత్నించగా భర్త పలుకకపోవడంతో తలుపు పగులగొట్టి మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.

ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో బాలబాలికల క్రీడా పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 500 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర క్రీడాపోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చినవారికి బహుమతులు అందించారు. ఎంఈఓ మాధవి, డీవెఎస్ఓ వెంకటేష్‌శెట్టి పాల్గొన్నారు.